

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.76,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,820
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,700
రిటైల్ వెండి గ్రాము	రూ.94.70

క్లుప్తంగా

కత్తెర పురుగుతో జాగ్రత్త

తిరుపతి సిటీ: మొక్కజొన్న, పశుగ్రాస పంటలను పండించే రైతులు వర్షాకాలంలో కత్తెర పురుగుతో జాగ్రత్తగా ఉండాలని, నివారణా చర్యలు వెంటనే చేపట్టాలని తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్ సంచాలకులు డాక్టర్ వి స్రవంతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.దేవకి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పంట చుట్టూ ఎకరాకు నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకుని, కలుపులేకుండా చూసుకోవాలని తెలిపారు. పంట తొలిదశలో వేపగింజల కషాయం, వేప నూనెను 5మి.లీ నీటిలో పిచికారీ చేస్తే మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

వేడుకగా పవిత్ర సమర్పణ



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం వేడుకగా గ్రంధి పవిత్ర సమర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో పూజ, హోమం, లఘు పూర్ణాహుతి అనంతరం గ్రంధి పవిత్ర సమర్పణ నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు యాగశాల పూజ, హోమం, పట్టు పవిత్ర ప్రతిష్ట జరిపించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ పాల్గొన్నారు.

విమానాశ్రయంలో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

రేణిగుంట : తిరుపతి విమానాశ్రయంలో సర్వర్ సమస్య తలెత్తడంతో శుక్రవారం ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో విమానయాన సంస్థల ప్రతినిధులు ఆయా కౌంటర్లలో మాన్యువల్‌గా టికెట్లు జారీ చేశారు. అలాగే బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోనూ సేవలు స్తంభించాయి.

'అడిగోపుల' రచనలు అజరామరం



అడిగోపుల వెంకటరత్నం (ఫైల్)

తిరుపతి కల్చరల్ : సాహితీరంగంలో అడిగోపుల వెంకటరత్నం రచనలు అజరామరమని పలువురు కవులు కొనియాడారు. ప్రముఖ రచయిత తిరుపతికి చెందిన అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. తిరుపతి స్థిరనివాసి అయిన అడిగోపుల వెంకటరత్నం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం, కొత్తవంగల్లులో జన్మించారు. ప్రాథమిక విద్య నెల్లూరు జిల్లాలోసాగింది. తిరుపతిలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఉద్యోగం చేశారు. విద్య, ఉద్యోగ సంఘాల నాయకుడిగా పేరు గడించారు. రచయితగా సాహిత్య రంగంలో 1984 నుంచి ఇప్పటి వరకు ఆయన 28 కవితా సంపుటిలు, ఒక కథా సంపుటిని ప్రచురించారు. వీరి రచనలు కొన్ని తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. తిరుపతి నుంచి తానా వరకు మొత్తం 20 పురస్కారాలు అందుకున్నారు. నాగార్జున, ఎస్వీయూనివర్సిటీల్లో అడిగోపుల రచనలపై పరిశోధనలు జరిగాయి. తెలుగు సాహిత్యంలో సాహితీ శిఖరాలైన ఆరుద్ర, ఆత్రేయ, సినారే, ఎస్.గోపి, సంజీవ్ దేవ్, రావిశాస్త్రి, రావూరి భరద్వాజ, కొలుకలూరి ఇనాక్, కొండవీటి వెంకటకవి, పెద్దిబొట్ల సుబ్బరాయులు ఆయన పుస్తకాలకు ముందు మాట రాశారు. అడిగోపుల మృతి పట్ల పలు సాహితీ సంస్థలు, పలువురు రచయితలు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సాహితీ వేత్తలు శైలకుమార్, భూమన్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత సాకం నాగరాజు, ప్రముఖ రచయిత డాక్టర్ మౌని శుక్రవారం ఎన్‌జీఓ కాలనీలోని నివాసంలో అడిగోపుల వెంకటరత్నం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వెంకటరత్నం మృతి పట్ల అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీమురళి, డాక్టర్ నెమలేటి కిట్టన్న, తెలుగు భాషోద్యమ సమితి నేతలురతమటం రామచంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, శ్రీమన్నారాయణ, జిల్లి రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, అవధాని ఆముదాల మురళి, నివాళులు అర్పించారు.

ఘనంగా పుష్పాంజలి

తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో అడిగోపుల వెంకటరత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు టింకాలయ దామోదరం, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, గురునాథం పాల్గొన్నారు.

సింహపురి వర్సిటీ ఇన్‌చార్జి వీసీకి సత్కారం

తిరుపతి సిటీ : నెల్లూరు సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కర్ రావును ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సెక్రటరీ ఎన్.సుబ్రమణ్యం శుక్రవారం సింహపురి వర్సిటీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగాధిపతిగా, ప్రొఫెసర్‌గా సుదీర్ఘకాలం పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి విజయభాస్కర్‌రావు అని కొనియాడారు. ఆయనకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. సింహపురి వర్సిటీ అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేస్తారనే నమ్మకం ఉందని వెల్లడించారు.



వీసీ విజయభాస్కర్‌రావును సన్మానిస్తున్న ఎస్వీయూ నాన్ టీచింగ్ సిబ్బంది

కోలుకుంటున్న బాలిక

- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

తిరుపతి క్రైమ్: నగరంలో దుండగుడి చేతిలో గాయపడిన బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. రాయల్‌నగర్‌లోని తుడా ఫ్లాట్లో నివాసమున్న జయలక్ష్మి(70) గురువారం హత్యకు గురైంది. ఇదే క్రమంలో ఆమె మనవరాలు నియాతి (14)పై దుండగుడు కత్తితో కిరాతకంగా దాడి చేశాడు. పెద్ద మనవరాలు ప్రేరణ తలకు కూడా గాయమైంది. నియాతికి ఎక్కువ కత్తిపోట్లు తగలాయి. ప్రస్తుతం ఆ బాలిక నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతోంది.

నిందితుడి కోసం గాలింపు

రాయల్ నగర్ ఘటనపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చేపడుతున్నాయి. నగరంలోని సీసీ కెమెరాలు, వారి ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఘటన జరిగిన ఇంటికి సమీపంలో ఉన్న శ్రీనుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటన ప్రాంతంలో నుంచి అంతడు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లి రైల్వే స్టేషన్ సమీపంలోని గ్యారేజ్ వద్ద వదిలినట్టుగా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో రైల్లోనే నిందితుడు పరారైనట్లుగా భావిస్తున్నారు. గతంలో కూడా ఇదేవిధంగా మృతురాలు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలికి వార్నింగ్ ఇచ్చినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. ఆ సమయంలో కూడా నిందితుడు రైల్లో పారిపోయి ఒక ఏడాది పాటు ఇతర ప్రాంతాల్లోనే తలదాచుకొని తిరిగి తిరుపతికి చేరుకున్నాడు. ప్రమాదంలో గాయపడిన బాలిక నియాతిని శీను వేధించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే మృతి చెందిన జయలక్ష్మి శీనుని మందలించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇదిలావుండగా పోస్టుమార్టం అనంతరం జయలక్ష్మి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపడుతున్న ఉమ

తిరుపతి సిటీ :మహిళా సాధికారతే లక్ష్యంగా శ్రీపద్మావతి యూనివర్సిటీ స్థాపించబడినదని, ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వి.ఉమ తెలిపారు. శుక్రవారం మహిళా వర్సిటీలో ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1983లో వర్సిటీ స్థాపించినప్పటి నుంచి అధ్యాపకులుగా పనిచేశామన్నారు. సుమారు 35 ఏళ్లకు పైగా బోధన, పరిశోధనా రంగాలలో అనుభవం ఉందని, గతంలో రెక్టార్‌గాను, ఇన్‌చార్జి వీసీగాను వర్సిటీకి సేవలందించానని చెప్పారు. మరో సారి ఇన్‌చార్జి వీసీగా అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని, రుసా నిధులతో వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, డిప్యూటీ రిజిస్ట్రార్ గీతావాణి, బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతి నాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న భూపతినాయుడు

తిరుపతి సిటీ : ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ భూపతి నాయుడును నియమిస్తూ వీసీ అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వర్సిటీ పరిపాలనాభవనంలో రిజిస్ట్రార్‌గా భూపతినాయుడు బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా వర్సిటీలోని డీడీఈలో ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌ను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వైభవంగా కావమ్మ.. మారయ్య ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కావమ్మ, మారయ్య

తిరుపతి మంగళం : తిరుపతి నెహ్రూనగర్‌లో వెలసిన కావమ్మ మారయ్య ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు కట్ట జయరామ్ యాదవ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరించి నెహ్రూనగర్, బొమ్మగుంటలో ఊరేగించారు.

శిక్షణతో బోధన సామర్థ్యాల పెంపు

– తిరుపతి డీఈఓ శేఖర్



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: క్షేత్ర స్థాయిలో విద్యా బోధనల్లో మార్పు స్పష్టంగా కనిపించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. డీఈఓ మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో గ్రహించిన, ఆకళింపు చేసుకున్న విషయాలతో బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేలా పాఠాలు బోధించాలన్నారు. 9 రోజుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, శిక్షకులు రమేష్, బాలసుబ్రమణ్యం, హిమగిరి, వేణుగోపాల్, పుత్తూరు, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, వడమాలపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్విమ్స్ వర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి తుడా : తిరుపతి స్విమ్స్ యూనివర్సిటీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బి.బిట్ల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్, బీపీటీ బీఎస్సీ అల్‌లైడ్ హెల్త్ సైన్సెస్ (పారా మెడికల్) కోర్సులకు అర్హులైన వారు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ బైపీసీ, తత్స సమానమైన అర్హత, ఏపీఈఏపీసెట్–2024 ర్యాంక్, మెరిట్ ప్రాతిపాదికన సీట్ల భర్తీ ఉంటుందని చెప్పారు. అప్లికేషన్లను ఏపీ ఆన్‌లైన్ సెంటర్స్ ద్వారా కానీ, స్విమ్స్ వెబ్‌సైట్ ద్వారా పంపవచ్చని వెల్లడించారు. ఇతర వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎంబీయూలో నూతనోత్సాహం

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీలో ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో అడ్మిషన్లు పొందిన నూతన విద్యార్థుల ఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని స్థానిక దాసరి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీన్ డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ భవిష్యత్తు సవాళ్లను, అవకాశాలను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను ఎంబీయూ సమకూరుస్తుందని వివరించారు. డీన్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సతీష్ మాట్లాడుతూ వర్సిటీలో మౌలిక సదుపాయాలను తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ సారథి వర్సిటీ తరగతి గదిలో విద్యార్థుల వ్యవహార శైలి పట్ల పలు కీలక సూచనలను చేశారు. ముఖ్యఅతిథి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ రామారావు మాట్లాడుతూ వర్సిటీ ఏ విధంగా అత్యధిక విద్యార్థులకు ఆకర్షణీయమైన వేతనాలతో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందో వివరించారు.

చిరుత ఆచూకీ ఎక్కడ?

- ట్రాప్ కెమెరాలతో అన్వేషణ

చంద్రగిరి: కొటాల జగనన్న కాలనీ సమీపంలో చిరుత సంచారాన్ని గుర్తించామని, దాన్ని పట్టుకోవడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొటాల సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన కొటాల జగనన్న కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించి వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసినట్టు వెల్లడించారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి 17వ తేదీన అడవిలో చిరుత పులి పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు. చిరుత కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ కెమెరాతో దాని ఆచూకీ కోసం గాలించినట్లు వెల్లడించారు. కొటాల, చుట్టుపక్కల గ్రామాలలో రెండు బృందాలతో రాత్రింబవళ్లు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పశువుల కాపరులు, గొర్రెల కాపర్లను అడవిలోకి వెళ్లరాదని సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ఎవరూ బయటికి రాకూడదని చెప్పారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ మాధవి, డీఆర్ఓ వేణు, ఎఫ్ఎస్ఓ చైతన్య, ఎఫ్‌బీఓలు అనిత, రజిని, యుగంధర్ ఉన్నారు.

ఎస్వీయూ అభివృద్ధే లక్ష్యం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఎస్వీయూ పరిపాలనాభవనంలో ఇన్‌చార్జి వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత ఎస్వీయూ వీసీగా బాధ్యతలు చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీలో గత 35ఏళ్లుగా ప్రొఫెసర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా, అకడమిక్ డీన్‌గా, డీఓఏ డైరెక్టర్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా పలు హోదాల్లో విధులు నిర్వర్తించినట్లు వివరించారు. వర్సిటీతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, విద్యార్థుల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తామని వెల్లడించారు. బోధన, బోధనేతర సిబ్బంది, అధికారుల సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య, ప్రొఫెసర్ భూపతి నాయుడు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

చిరుద్యోగులపై వేధింపులు మానుకోవాలి

తిరుపతి కల్చరల్: జిల్లాలో అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీం వర్కర్లపై టీడీపీ నేతలు రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ వేధింపులు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు గ్రామంలో టీడీపీ నేత పి.ఈశ్వర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్‌తో అసభ్యంగా ప్రవర్తించడం, సెంటర్‌లో రికార్డులు ఎత్తుకెళ్లడం, లబ్ధిదారులను బెదిరించి తెల్లకాగితాల్లో సంతకాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతేగాక ఉద్యోగానికి రాజీనామా చేయమని దాడి చేయడం చూస్తుంటే ఇంతకన్నా అరాచకం ఏముందని ప్రశ్నించారు. సీడీపీవోకు ఫిర్యాదు చేస్తే బాధితురాలిపైనే కేసు నమోదు చేయడం చూస్తే వేధింపులు ఎంత పరాకాష్టకు చేరాయో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీటీడీలో ఉద్యోగోన్నతులకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : టీటీడీ వాటర్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లోనున్న ప్రమోషన్లను వెంటనే మంజూరు చేయాలని టీటీడీ వాటర్ అండ్ ఎలక్ట్రికల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలోయూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

తిరుపతి వాసికి బంగారు పతకం



చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న తిరుపతికి చెందిన బత్తల రవితేజ్

తిరుపతి అర్బన్: న్యూరో సర్జరీ సూపర్ స్పెషాలిటీ మాస్టర్స్‌లో తిరుపతికి చెందిన డాక్టర్ బత్తల రవితేజ్ బంగారు పతకం సాధించాడు. తిరుపతిలోని ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్ అధినేత గిరినాయుడు చిన్న కుమారుడు రవితేజ్ చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ కళాశాలలో 2018–24లో న్యూరో సర్జన్‌లో మాస్టర్స్ పూర్తిచేశాడు. శుక్రవారం అతను కళాశాల స్నాతకోత్సవంలో భాగంగా ఛత్తీస్‌గడ్ అమిటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ సెల్వమూర్తి చేతులమీదుగా బంగారు పతకాన్ని అందుకున్నాడు. రవితేజ్ నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో 2018లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. న్యూరో సర్జన్‌లో దేశీయ, విదేశీ వైద్యుల నుంచి శిక్షణ పొందిన ఆయన వ్యాధిగ్రస్తులకు ఉత్తమ వైద్యం అందించి ప్రత్యేక గుర్తింపును సాధించారు. ఆ మేరకు శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

పనుల్లో వేగం పెంచండి

తిరుపతి తుడా: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగడంతో పాటు నగర భద్రతకు తోడ్పడుతుందని చెప్పారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగల చోరీ కేసులో రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఇళ్లల్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలను అపహరించుకెళ్లిన రెండు వేర్వేరు కేసుల్లో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా వందవాసి తాలూకా మజయుమలయుర్‌కు చెందిన రాఘవన్, విజయ్ అలియాస్ శివకు ఒక్కొక్క కేసులో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు కానిస్టేబుల్ పణీంద్ర తెలిపిన వివరాల మేరకు.. 2022 జూన్ 8వ తేదీ తిరుపతి రూరల్ కాలూరు క్రాస్ వద్ద ఓ ఇంట్లోకి నిందితుడు అక్రమంగా ప్రవేశించి 33 గ్రాముల బంగారు నగలు, 570 గ్రాముల వెండి వస్తువులను అపహరించికెళ్లాడు. ఇంటి యజమాని రామమోహన్ ఫిర్యాదు మేరకు ఎంఆర్‌పల్లి పోలీసులు నిందితుడు విజయ్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో అతనికి న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా మరో కేసులో 2022 సెప్టెంబర్ 8వ తేదీ ఎంఆర్ పల్లి గాయత్రీ నగర్‌లో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలను నిందితుడు విజయ్ అపఅపహరించికెళ్లాడు. ఈ కేసులోనూ నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ భాను కిరణ్మయి వాదించారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ..

- లారీ ఢీకొని ముగ్గురు మృతి
- ఒకరికి గాయాలు

పాకాల: సమీప బంధువులందరూ ఓ శుభకార్యంలో కలిశారు. ఆనందంగా గడిపారు. ఉదయం కూలి పనికి వేళ్లేందుకు ఆలస్యం కాకుండా సమయానికి చేరుకోవాలని ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో లారీ మృత్యువు రూపంలో కబళించింది. ముగ్గురిని పొట్టన బెట్టుకుంది. ఈ ఘటన మండలంలో గురువారం రాత్రి విషాదాన్ని నింపింది. స్థానిక పోలీసుల కథనం.. రొంపిచెర్ల మండలం, బోడిపాటివారిపల్లి పంచాయతీ, దద్దాలవారిపల్లి గ్రామానికి చెందిన కె.నారాయణ, పాకాల మండలం, దామలచెరువు పంచాయతీ, చుక్కావారిపల్లికి చెందిన నాగరాజ, వాణి కుమారుడు ఇ.నాగమల్లయ్య, ఐరాల మండలం, వేదగిరివారిపల్లి పంచాయతీ, రామతీర్థ సేవాశ్రమ గ్రామానికి చెందిన కె.జయచంద్ర, అదే గ్రామం తీర్థ ఎస్టీ కాలనీకి చెందిన మనోజ్ అక్క కుమారుడు పురుడు కార్యక్రమంలో కలిశారు. కార్యక్రమం ముగిసిన తరువాత గురువారం రాత్రి 10 గంటల సమయంలో కూలిపని కోసం రొంపిచెర్లకు పయనమయ్యారు. ఉదయం పనిసమయానికి వెళ్లాలని నలుగురూ నారాయణ ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మండల పరిధిలోని కట్టకిందపల్లి సమీపంలోని పాత అక్కగార్ల గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. లారీ ఢీకొన్న ప్రదేశం నుంచి ద్విచక్రవాహనాన్ని సుమారు 150 మీటర్లు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో కె.నారాయణ(22), ఈ.నాగమల్లయ్య(16), కె.జయంద్ర(37) అక్కడికక్కడే మృతి చెందారు. మనోజ్ తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. మృతి చెందిన నారాయణకు వివాహం జరిగి రెండేళ్లు కావస్తోంది. భార్య కె.శైలు ప్రస్తుతం గర్భవతి. ఎదిగి వచ్చిన కుమారుడు అండగా ఉంటాడనుకున్న నాగమల్లయ్య తల్లిదండ్రులు నాగరాజ, వాణికి నిరాశే మిగిలింది. కె.జయచంద్రకు భార్య నాగవేణితో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు 4వ తరగతి, కుమార్తె 2వ తరగతి చదువుతున్నారు. మిగిలిన ఒక బాబు అంగన్‌వాడీ, మరో చిన్నపాప ఉన్నారు. అడవుల్లో దొరికే గడ్డలు, పండ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే వారు ప్రమాదవశాత్తు మృత్యుఒడికి చేరడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించారు.

దేవుడా ఎందుకింత గర్భశోకం



జయచంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

ఐరాల: 'దేవుడా.. మేమేమి పాపం చేశాం. మాకెందుకింత శిక్ష వేశావు దేవుడా..! నలుగురు బిడ్డల్ని ఎలా సాకేది. కడుపులో ఉన్న నలుసుని ఎలా పెంచేది..'? మీరైనా చెప్పండి నాయనా..! అంటూ చుట్టుపక్కల ఉన్న వారిని అర్థిస్తూ.. గుండెలు బాదుకుంటూ ఆ గర్భవతులు రోదించిన తీరు గుండెల్ని పిండేసింది. ఈ విషాద ఘటన మండలంలోని గుండ్లపల్లె సిద్ధగిరిక్షేత్రం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. పాకాల మండలం, దామల చెరువు సమీపంలోని పత్తిపాటివారిపల్లె అక్కగార్ల ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఇందులో ఐరాల మండలం, గుండ్లపల్లె సిద్ధగిరి క్షేత్రం ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర(30), నారాయణ(25), చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నాగేంద్ర(14) ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు స్వగ్రామానికి తరలించారు. ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్రకు నలుగురు పిల్లలు కాగా.. ప్రస్తుతం భార్య గర్భవతి. నారయణ భార్య నాగమణి కూడా గర్భిణి. నాగేంద్ర కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరితో పాటు ఎస్టీ కాలనీకి చెందిన మనోజ్ తీవ్ర గాయాలతో కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం మృతదేహాలు వారి స్వగ్రామాలకు చేరడంతో కుటుంబీకులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. నారాయణ అంత్యక్రియలు రొంపిచెర్లలో నిర్వహించగా.. నాగేంద్ర, జయచంద్ర అంత్యక్రియలు చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీలో నిర్వహించారు.

క్లుప్తంగా

కుష్టు రోగుల గుర్తింపునకు సర్వే

పాకాల : మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తులను త్వరితగతిన గుర్తించేందుకే ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు డీఎల్‌టీఓ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సర్వేపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కుష్టు బాధితులను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి లెప్రసీ రోగుల జాబితా తయారు చేయాలని సూచించారు. వ్యాధి ముదరక ముందే వైద్య సేవలు అందిస్తే తీవ్రత తగ్గుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, డాక్టర్ రవిరామ్, డీపీఎం తిరుజ్ఞానం, ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీకి సత్కారం



వీసీ సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును వర్సిటీ టైంస్కేల్ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న టైంస్కేల్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని విన్నవించారు. క్యాక్రమంలో టైంస్కేల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు మధుసూదన్, అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, కార్యదర్శి గోపి, ప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, మునిరాజా, మణి, ముని, రఫీ, మస్తాన్ పాల్గొన్నారు.

'ఎస్‌జీఎస్' విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : నగరంలోని ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌కు చెందిన విద్యార్థులు ఒడిశాలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ క్యాంప్–2024 దిగ్విజయంగా పూర్తి చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డి.పరమేశ్వర, ఆర్మీవింగ్ అధికారి పి.హరీష్‌రెడ్డి సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

తిరునగరం.. చెత్తమయం!



మధురానగర్ దోభీఘాట్ రోడ్డులో పేరుకున్న చెత్త

పవిత్ర తిరునగరం చెత్తమయంగా మారిపోయింది. ఏ వీధిలో చూసినా పారిశుద్ధ్య అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా వ్యాపార సముదాయ ప్రాంతాల్లో అయితే ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. సమస్యల పరిష్కారం కోసం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ఒక్కరోజు విధుల బహిష్కణ చేపట్టిన క్రమంలో ఇంటింటా చెత్త సేకరణ సైతం నిలిచిపోయింది. విష జ్వరాలు ప్రబలుతున్న తరుణంలో ఈ పరిస్థితి తలెత్తడంపై ప్రజానీకం తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఈ మేరకు కార్మిక సంఘం నేతలతో కమిషనర్ అదితీసింగ్ సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో సొంత అజెండాలతో సమ్మెకు దిగడంపై మండిపడ్డారు. కనీసం నోటీస్ కూడా ఇవ్వకుండా విధులు బహిష్కరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో నెలకొన్న అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనుల్లోకి వెళ్లాలని ఆదేశించారు. లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్‌తో కలిసి నిత్యం ఉదయం 5 గంటలకే రోడ్లపైకి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశుభ్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నామని.. ఈ క్రమంలోనే కార్మికులు సైతం ప్రజారోగ్య రక్షణకు సహకరించాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. కమిషనర్ ఆవేదనను అర్థం చేసుకున్న పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు.

– తిరుపతి తుడా



చేపల మార్కెట్ రోడ్డులో..



భవానీ నగర్ రోడ్డులో..



తీర్థకట్ట వీధి జంక్షన్ రోడ్డుపై..



అన్నారావు రోడ్డులో..



సున్నపు వీధి రోడ్డులో..



తీర్థకట్ట వీధిలో..



స్కావెంజర్స్ కాలనీ వద్ద..

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐడీ అధికారి పద్మలత

తిరుపతి సిటీ : దేశంలో నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని సీఐడీ రిజనల్ అధికారి, డీఎస్పీ పద్మలత సూచించారు. శుక్రవారం నగరంలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మలత మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగినప్పుడే విద్యార్థినులకు మనోధైర్యం వస్తుందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాలలో తలెత్తిన పరిణామాలు, వాటి ప్రభావం, ఇటీవల మహిళలపై జరిగిన సంఘటలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భువనేశ్వరి, సీఐడీ ఎస్‌ఐలు బాబా ఫక్రుద్దీన్, మంజుల, డాక్టర్ స్నేహలత, శారద, విద్యార్థి సమాఖ్య సభ్యులు జయమ్మ పాల్గొన్నారు.

శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు నూతన చట్టాలపై సీఐడీ అధికారి పద్మలత అవగాహన కల్పించారు.

సిరులతల్లి సేవలో ఉడిపి పీఠాధిపతి

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం ఉడిపి పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీ సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. పీఠాధిపతి ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



అమ్మవారి ఆలయం వెలుపల విశ్వప్రియ తీర్థ స్వామీజీ

ఆదాయ పన్ను పరిమితి పెంపునకు డిమాండ్

పాకాల : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆదాయ పన్ను పరిమితిని పెంచి రూ.10 లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలని బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లె ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో గతంలో ఉన్న రూ.7 లక్షలు మినహాయింపును రూ.10 లక్షల వరకు పెంచడంతో పాటు 80 సీ అమలు చేయాలన్నారు. అలాగే రైలు చార్జీల్లో సీనియర్ సిటిజన్లకు గతంలో కల్పించిన రాయితీలను మళ్లీ పునఃప్రారంభించాలని సూచించారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, నాయకులు జ్యోతిప్రసాద్, ఆదికేశవులు, తులసీరామ్, జయబాల, విజయమోహన్, వెంకటయ్య, గిరి, రాజేంద్రుడు, గోపాలయ్య పాల్గొన్నారు.